# రూపాయిలూ-అణాలూ

"వెడుతున్నారా?"

త్వరగా గుమ్మం దిగుతూన్న సుందరం ఒక్కసారి వెను దిరిగి చూసి రెండడుగులు వెనక్కి వేశాడు...శశి గదిలో అడుగెడుతూ "వెళ్తున్నారా?" అన్నది రెండోసారి.

"ఆ..."

అప్రయత్నంగా అతను లోపలికి వచ్చేశాడు...శశి అలాగ అడుగుతుందని అతనప్పటిదాగా అనుకోనట్లు.

తెలుసుకుందామని అడిగాను-అంతే. మీరు వెళ్లవచ్చు" కుర్చీలో కూర్చుంటూ అన్నది శశి.

"నామాట కొంచెం వినవూ శశీ?"

"నేను వినక ఏమైనా అన్నానా?"

"అది కాదు..."

"డబ్బు-అంతా తీసికెళ్తున్నారా?"

"రెండువందలు..."

"చాలవనేగా బాధ?"

నిజానికి శశి కోపంగా అనలేదు...కాని సుందరాని కా మాటలు ముళ్లల్లే గుచ్చుకున్నాయ్.

"వాడు...నా స్నేహితుడు శశీ!" నెమ్మదిగా ఆమె వైపు తిరుగుతూ అన్నాడు సుందరం.

శశి తేలికగా నవ్వింది...కానిదెవరూ? అన్నట్టు.

"క్షమించండి...మీరు వెళ్లండి"

"కోపం వచ్చిందా శశీ?"

"కోపం!...వొచ్చి ఏం చెయ్యాలీ?...వెళ్లండి."

శశికి కోపం వచ్చిఉంటే సుందరం పని తేలికయ్యేది. కాని, పరీక్షచేసినా, ఆమె ముఖాన కోపరేఖ చిన్నెలుకూడా కనపడలేదు.

సుందరం ఆమె కుర్చీముందు నిలబడి, "ఒక్కమాట చెప్తావా శశీ?" అన్నాడు.

ముఖం ఎత్తి చూస్తూ, "ఎప్పుడూ చెప్తూనే ఉంటాను" అన్నది శశి...నిలబడిన సుందరంతో.

"నేక ఆప్తుని భార్య ప్రాణంకన్న నెక్లస్ ఎక్కువ విలువైన దంటావా?"

శశి చిన్నగా నవ్వి ఊరుకున్నది.

"చెప్పు శశీ!"

"ఎలా చెప్తానూ? ఎలా చెప్పినా నామీదికే వస్తుంది!"

"ఏం?"

"అవునంటే, నన్ను సంకుచిత భావాలతో కుళ్లుతున్న స్వార్థపరురాలని అంటారు; కాదంటే..."

"పోనీ—ఒక్కమాట చెప్పు. నేనీ పని చేస్తే నీకు కోపం వస్తుందా?"

"దానికీ అదే జవాబు!!"

రెండుసార్లు అటూ ఇటూ పచారుచేశాడు సుందరం... ఏ ఆలోచనా తోచనట్లు.

"వెళ్లండి—"

ఆగి ఆమెవైపు చూశాడు సుందరం...ఆమె జడని భుజంమీదినించి ముందుకు వేసుకుని, దానితో కాలక్షేపం చేస్తూ ఉన్నది. ఒక్కసారి ఆమెవంక చూసి, సుందరం చరచర బయటికి నడిచాడు.

గోపాలం సుందరానికి చిన్నప్పటినించీ స్నేహితుడు. కొంచెం లేని కుటుంబాన్నించి రావడంవల్ల అతను ఉపాధ్యాయుడయ్యాడు. సుందరం బేంక్ సబ్ అకౌంటెంట్‌గా ఉంటున్నాడు. గోపాలం భార్యకి రెండు నెలలనించి జబ్బుగా ఉన్నది; డాక్టరు తన ఫీజు కొంత అయినా ఇస్తేకాని మందివ్వనంటాడు. పళ్లూ, టానిక్కులూ కొనడానికే గోపాలం నానా అవస్థా పడుతున్నాడు.

సుందరానిది చాలా మెత్తటి మనస్సు - అతనిచేత త్యాగం చేయించడానికి ఏ కాస్త బాధ అయినా చాలును... నాలుగురోజుల క్రిందట జీతం అందింది.

"నెక్లెస్ కొనుక్కుందాం" అంది శశి,

"అలాగే"నన్నాడు...

శశి కాపురానికి వచ్చిన సంవత్సరంనుంచీ, నగలజోలికి పోలేదు. బహుశా ఈ కోర్కె ఉండిపోయి ఉంటుంది.

నిన్నను బజారులో గోపాలం కలిశాడు....షావుకారు అతని కింక అరువు ఇవ్వనంటాడు.

"ఏం గోపాలం ?...ఏమిటి సంగతి?" అన్నాడు-ఏదో దైనందినపు కష్టమేనని.

గోపాలం కళ్లనీరు పెట్టాడు...తన దుస్థితి అంతా చెప్పేడు. తనకిచ్చేది అరవైఅయిదు...భార్య, ఇద్దరు పిల్లలు ...రెండు నెలలనుంచి ఆమె మంచం ఎక్కింది. ఇంటిలో వంటచెయ్యాలి—మందులు తేవాలి...బడికి పోవాలి...చేతిలో దమ్మిడీ లేదు...షావుకారికి బాకీపెరిగింది...డాక్టరుకి ఫీజు...

గోపాలం ఎన్నడూ అలా మాటలాడలేదు సుందరంతో-అంత దారిద్ర్యాన్నీ అతను సహించాడు...కాని...దేనికిహద్దు లేదూ ?

సుందరం మనస్సు కరిగిపోయింది... "ఛా...అలా అవుతావేం!...నాతో చెప్పలేకపోయావ్?" అన్నాడు.

ఆ జవాబు వినగానే గోపాలం కళ్లలో ప్రతిఫలించిన సంతృప్తిని సుందరం ఎప్పుడూ మరిచిపోడు...అంత దైన్యంగా ఉందతని పరిస్థితి.

"నా దగ్గిర డబ్బు ఉందిలే...సాయంత్రం రెండువంద లిస్తాను" అని, అక్కడే మాటయిచ్చాడు...

"నిజంగా, సుందరం?!"

పాపం, నమ్మలేకపోయాడు గోపాలం. సుందరానికి గుండె కరిగిపోయింది.

"నిజంగా...సాయంత్రం..."

సుందరం వెళ్లిపోయాడు... గోపాలాన్ని ఇంక ఆ స్థితిలో చూడలేక. గోపాలం ముఖంలో ఆ కన్నీళ్ళ మధ్య కనిపించిన సంతోషం పూవు వెనక ముల్లల్లే సుందరం మనస్సుకి గ్రుచ్చుకున్నది.

సాయంత్రం బేంకునించి రాగానే, "ఇవాళ బజారుకి వెళ్ళాలి" అంది శశి.

"ఎందుకూ ?"

"నెక్లెస్ కొనుక్కోడానికి... మళ్ళా డబ్బు కరిగి పోతుంది!"

అప్పటిదాకా సుందరానికి ఈ సమస్య పూరించాల్సి ఉంటుందనే విషయమే జ్ఞప్తికి రాలేదు.

"కొంచెం ఆగు శశీ..."

"ఏం ?"

మహాశ్చర్యంతో అడిగింది శశి.

"కొంచెం డబ్బు అవసరంగా ఉంది..."

సుందరం అంతా వివరించి చెప్పాడు. కాని, అతను చెప్పకపోయినా ఆమెకి తెల్సును...ఈ సంవత్సరంనించీ ఆమె అనుక్షణమూ అతనిని తెల్సుకుంటూనే ఉంది. ఎవరన్నా సరే, దీనంగా అడుగకపోవడమే లోపం...జేబులో లేకపోవడమే పాపం. అతనైౖ లేదనడు...జీతాలు కట్టని కుర్రాళ్ళూ, తీర్థ యాత్రలు చేసేవాళ్ళూ, బీదలూ...అందరూ అతని దగ్గరనించి ఉపకారాలు పొందేవాళ్ళే. గట్టిగా ఒక వర్షం పడితే చాలును ఇళ్లు పోయినవాళ్లు వస్తారు.

ఇత నెవ్వరికీ ఇవ్వనని చెప్పలేదు...ఇవ్వకుండా ఉండ లేదు. నెలకి వస్తూన్న రెండున్నర వందలలో ఒక వందైనా దానాలకి పోతూనే ఉంటుంది.

అవన్నీ తెలిసిన శశి, ఇంత జరుగుతుందని ఎప్పుడూ అనుకోలేదు. అడుగక అడుగక తాను అడిగింది; సుందరం వెళ్దామని మాట ఇచ్చాడు. కొంత నమ్మకం అయినా ఉండ కుండా ఎలా ఉంటుంది?

"అయితే నెక్లెస్ అబద్ధమన్న మాట!"

—దెబ్బతిన్న విషయం ఆమె దాచలేక పోయింది... కాని మరుక్షణమే తేరుకున్నది. స్వార్థపరురాలిగా కనిపించడం ఆమె కిష్టంలేదు.

అత నేమీ జవాబు చెప్పలేదు. బట్టలు వేసుకుని, డబ్బు జేబులో ఉంచుకున్నాడు. చకచక మెట్లు దిగుతున్నాడు.

"వెడుతున్నారా ?"

అని అనకుండా ఉండలేకపోయింది - అధమం తన నిర్లిప్తత అయినా అతని మనసుని మార్చుతుందని ఆమె అనుకున్నది. ఈ సంవత్సరమూ తాను ఎన్నడూ అతని ఈవిని అడ్డుకోలేదు; సాధ్యమైనంతవరకూ ప్రోత్సహించింది; మనస్సు తిరుగబడినప్పుడు నిశ్శబ్దాన్ని అడ్డం వేసుకున్నది... తాను బట్టలు కొనుక్కోడానికి ఉంచుకున్న రూపాయిలు బడిపిల్లల జీతాలకి అవసరం అయ్యాయి; ఇచ్చింది. తాను గొలుసుబాగు చేయించడానికి తీసుకున్న డబ్బు వర్షానికి కూలిపోయిన ఇళ్ళు నిలువబెట్టడానికి అవసరం అయింది; ఒడులుకున్నది. చెల్లెలి పుట్టినరోజుకి ఏదైనా పంపుదామని వేరే ఉంచిన మొత్తం ఆయన స్నేహితుడి ఉద్యోగ ప్రయత్నాలకి అవసరం అయింది; సరేనన్నది.

కాని, తన ఒక్క కోరికా, నోరారా ఔనని, తరువాత ఇలా చెయ్యడాన్ని ఆమె సహించలేకపోయింది...ఆ మాత్రం అనకుండా ఉండలేకపోయింది.

అతను వెనుకకి వచ్చాడు; ఆగుతా డనుకున్నది. కాని.. అతని ప్రయత్నం అంతా ఆమె నా విషయంలో అంగీకరింప చేయడానికే. ఆమె తన అభిప్రాయాన్ని అన్ని విధాలా దాచుకున్నది. ఆ విషయమై ఆలోచిస్తూన్నట్లే కనపడలేదు. కాని -

అతనిని జయించలేకపోయింది. స్నేహితుడి అవసరం కన్న భార్య మనస్సు ముఖ్యమైనదని ఆమె చూపలేకపోయింది.

అందుకనే అతనిని వెళ్ళమన్నది... డబ్బు మిగిలినా మంచిదే—దానితో సంతోషంగా ఎవరికైనా ఉపకారంజరిగినా మంచిదే...కాని, రెండూ కాకపోవడం ఎందుకూ?

అతను వెళ్లాడు......

కొద్ది నిమిషాలు రిబ్బను అల్లుతూ విప్పుతూ గడిపింది శశి...ఆమె కళ్లు గుమ్మం వైపే ఉన్నాయి. అతను వెనుకకి వస్తాడనే ఆశ అంతరాంతరాలలో ఎక్కడో......

ఈ సంవత్సర జీవితమూ ఒక్కసారి కళ్లముందుతిరిగింది శశికి...ఆమె ఎప్పుడూ అన్నిటిని భరిస్తూనే ఉంది; కళ్లవెనుకనే భావాలని దాచుకొంటూన్నది. కాని...కాని...దేనికి హద్దులేదు?

కుర్చీలోనించి నెమ్మదిగా లేచి, టేబిల్ దగ్గరికి వెళ్ళింది.. ఉత్తరాలు... దానినిండా. అందులో సగం అతనిచ్చిన, ఇస్తూన్న విరాళాలకి కృతజ్ఞతలే...చికాకుగా వాటిని దొంతి పెట్టి అడుగు అరలోకి తోసింది.

నిమిషాలు గడుస్తున్న కొద్దీ ఇన్నాళ్ళూ దాచుకున్న దుఃఖం, అణచుకొన్న ఉద్రేకం పెల్లుబికి రాసాగాయి...ఎందుకని తాను తన కోర్కెలన్నిటినీ అణచిపెట్టుకుని, పరులకోసం బాధపడాలి? అది హృదయవైశాల్యమా? తాను కొత్తచీర కొనుక్కుంటే, నగలు బాగుచేయించుకుంటే, తన చెల్లెలికి చిన్న బహుమతి పంపిస్తే, అది సంకుచితదృష్టి ఔతుందా?

శశికి మనసంతా పాడై పోయింది... ఇన్నాళ్ళనించీ ఆమెకి తరుచు మనస్సు పాడౌతూనేఉన్నది. కాని—ఈరోజు ఎందుకో తన జీవితం అంతా ఎడారిలాగ అనిపించింది. ఒంటరిగా తిరుగుతోన్నది...ఎందుకని ?

ఆ సంగతి ఆమెకి తెలుసును, దాచి, అణచిఉంచిన ప్రశ్న ఆమె నింక ఎదుర్కొనసాగింది...అతను తనని ప్రేమిస్తున్నాడా? అని. సుందరం ఆమెని ఏమీ అనడు...ఆమెకి పనులు చెప్పడు—ఏ విధంగానూ ఆమెమీద అధికారం సాగించడు. ఒక స్నేహితురాలన్నట్లు సౌమ్యంగా ప్రవర్తిస్తాడు...కాని—అన్ని విషయాలలోనూ స్నేహితురాలితోలాగే ప్రవర్తిస్తాడు.. ఆమెదగ్గర బిడియపడుతున్నట్లు, భయపడుతున్నట్లు ఉంటాడు. అతనికి కావలసిందంతా తన దానధర్మాలే...తన త్యాగమే... తా నేమనుకుంటూన్నదో, అతను ఆలోచించినట్లు కనపడడు..

రెండేళ్ళ క్రిందట అత నెవరో—తా నెవరో...

శశికి ఆ రోజులన్నీ కళ్ళముందు తిరుగసాగాయి... అప్పుడు నాన్నా తనూ ఒక చిన్న యింట్లో ఉంటూ, నాన్న పెన్షన్‌తో కాలం గడుపుకుంటూ ఉండేవారు... ఆ దగ్గిరే సుందరం ఇల్లు. రోజూ అతను కాలేజీకి వెళ్తూంటే తాను చూసి నిట్టూర్పులు విడిచేది - తానూ అలా వెళ్ళి చదువుకోలేనందుకు...స్కూల్ ఫైనల్‌లో తనకంత మంచిమార్కులు వచ్చినా, సీటుకోసం అప్లై చెయ్యడమే అవసరం లేకపోయింది.

రోజూ - ఉదయమూ, సాయంత్రమూ అతను తన ఇంటిముందునించి నడిచి వెళ్తూండేవాడు. తాను తన గదిలో

నించి అలాగే చూస్తూఉండేది. కొన్ని నెలల దాకా ఆమె కత నెవరో తెలిసే తెలీదు.

ఆ సాయంత్రం అట్లానే కిటికీదగ్గర నిలబడింది - పిల్ల లెవరో ఆడుకుంటున్నారు...తాను కాలేజీ, ఆటలూ తలచు కుంటూన్నది. క్రమంగా పిల్లలగోల దగ్గరికి వొచ్చింది... ఆ గోల మధ్య చీల్చుకుంటూ, ఓ కుక్కపిల్ల అరుపు దీనంగా విన పడుతోంది.

తనకేమీ సంబంధం లేనట్లు చూసిందటు - కాని, ఆ పిల్లలు రాళ్ళతో కొడుతూ, చెవిపట్టుకుని ఎత్తి క్రిందపడ వేస్తూ, పారిపోతూన్న దాన్ని వెనక్కి తంతూ ఆ కుక్కపిల్లని బాదిస్తూంటే, తాను సహించలేకపోయింది. త్వరగా తలుపు తీసుకునివచ్చి, "ఎందు కలా దాన్ని కొడుతున్నారు?" అన్నది - చికాకుగా.

వాళ్ళు ఆగారు...కాని ఆ శాంతి అట్టేసేపు నిలచేలా కనపడలేదు - వాళ్ళలో కొంచెం పెద్దవాడు ముందుకొచ్చి, "ఏం, మీదా?" అన్నాడు

"ఆఁ..." అన్నది తాను.

పిల్లలంతా ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు. కుక్క పిల్ల బాధగా, జాలిగా మూలుగుతూనే ఉంది.

"మీదైతే, గుర్తేమిటి?" అన్నాడు వాడు - మళ్ళా

తాను ఇరుకునపడ్డది-అబద్దాన్ని రుజువు చెయ్యడం ఎట్లా? అందులో, అలాటి అబద్ధాన్ని.

"కుక్కపిల్లలమీద పేర్లు రాసుకోరె!" అన్నది కోపం చూపుతూనే,

పిల్లలంతా కూడ బలుక్కున్నట్లు విక వికనవ్వారు... తనకి తానా పరిస్థితిలో ఎందుకు చిక్కుకున్నానా అని చికాకు కలిగింది శశికి...అంతగా నవ్వారు వాళ్లు.

ఓటమిని అంగీకరించి వెనక్కి పోకపోతే, పిల్లలంతా తమ భావి కార్యక్రమానికి సన్నద్ధు లౌతూన్నట్లు కనిపించింది శశికి—ఇంట్లో నాన్న కూడ లేడు...ఎలాగా?

"ఏమిట్రా అది?

ఆయనే-కాలేజీనించి వొచ్చినట్లుంది. తాను చూడనే లేదు. ఆ గుంపుదగ్గరికి వచ్చి, ఒకణ్ణి అడిగాడు.

"చూడన్నయ్యా! కుక్కపిల్ల వాళ్ళదిట!"

ఒక కుర్రాడు తనని చూపిస్తూ అన్నాడు...తాను సిగ్గుపడ్డది...

"అయితే?"

అతను మళ్ళీ వాడిని అడిగాడు.

"మేం ఆడుకుంటున్నాం...మరేం...ఆవిడొచ్చి..."

"ఊం..."

"వాళ్ళ కుక్కపిల్లట...లాక్కుపోతోంది..."

ఆయన తనవైపుతిరిగి, "ఇది మీదండీ?" అన్నాడు.

"కాదండీ...ఊరికే దాన్ని చంపుతోంటే, అడ్డుకుందామని అలా అన్నాను..." తాను అన్నది...

"ఏంరా?...కొట్టావా...?"

"ఛా!...లేదన్నయ్యా..."

వొట్టి అమాయికుడిలా బుంగమూతి పెట్టాడు వాడు-తనకే నవ్వు వొచ్చింది.

అతను హఠాత్తుగా, కుక్కపిల్లని పరీక్షించసాగాడు—తన చేతులనించి తీసుకుని, చినచిన్న దెబ్బలు తగిలాయి... ఎర్రగా, అక్కడా అక్కడా...

అతని ముఖం ఎర్రబడ్డది. పువ్వుమల్లే దాన్ని తీసుకుని, "దొంగ వెధవా!... ఇంటికి పద...నీపని చేస్తాను. దాన్ని ఎందుకురా అలా కొట్టావ్?" అన్నాడు.

ఆ పిల్లలముందు తన మర్యాద కాపాడినందుకూ, వాళ్ళ చేతులనించి ఆ జంతువుని రక్షించినందుకూ మనస్సులో భగవంతుడికి ధన్యవాదాలు చెప్పుకున్నది శశి.

అలా...అలాగ తాము పరిచయులయ్యారు. క్రమంగా ఆయన నాన్నతో చదరంగం ఆడేందుకని రోజూ వొచ్చేవాడు...ఆయననిగురించి అన్నీ తెలుసు కున్నది.

అతను తనని పెళ్ళిచేసుకున్నాడు...కొన్నాళ్ళ తరువాత. ఉద్యోగం వెంటనే దొరికింది-వచ్చేశారు...నాటినించీఅలా... అలా...

*　　*　　*

తొమ్మిది అయేదాకా శశి అలాగే ఆలోచిస్తూన్నది... పైకి పుస్తకంతో కాలక్షేపం చేస్తోన్నట్లు కనిపించినా, గడియారం తొమ్మిది కొట్టడంతో ఒక్కసారి ఈలోకంలో పడి, ఇంకా ఆయన రాలేదేమా అనుకున్నది. మామూలుగా ఈసరికి భోజనాలుకూడా అయిపోతాయి...ఎనిమిదికే అతను ఇంటికి వచ్చేవాడు.

కొద్ది నిమిషాలు ఇటూ అటూ పచారు చేసింది... బహుశా స్నేహితుడి ఇంటిదగ్గర పనివుండి ఆగారేమో!... కబురైనా పెట్టకూడదూ? ఇంట్లో ఒక్కతెనీ ఒదిలేసి...

వీధితలుపు వేసి, తిరిగి గదిలోకి వచ్చింది శశి...భోజనం చేద్దామని వంటింటి దగ్గరికి వెళ్ళింది. తలుపుతీసి లైటువేసి కంచం ఉంచుకుని, అన్నం పెట్టుకోబోయింది.

ఎందుకో ఒక్కసారి శశికి అన్నం మానేద్దాం అనిపించింది...మనసంతా పాడై పోయింది. నిమిష నిమిషానికి తనకి తెలీకుండా ఆ మనిషి నిర్లిప్తత, సాయంత్రం జరిగినదీ, ఆ సంవత్సరంనించీ జరుగుతోన్నదీ ఆమెని చాలా బాధిస్తోంది...

లేచింది - కంచం తీసి...

కాని...ఎందుకు మానెయ్యడం? అనుకున్నది శశి... ఆయన లేకపోతే తనకి అన్నం సయించదు...కదూ?

ఒక్కక్షణం - క్షణంలో సగం...ఔనని అనుకున్నది శశి...ఎప్పుడూ తాను ఒంటరిగా భోజనం చెయ్యలేదు. ఆయన ఏ రాత్రికో శ్రమపడి అలసివొస్తే తాను హాయిగా భోజనంచేసి కూర్చుంటే ఏంబాగుంటుంది?......

వెళ్ళిపోతోన్నదల్లా గిరుక్కున వెనక్కి తిరిగి కంచం పెట్టుకుని అన్నం పెట్టుకున్నది...ఎంత తించేనేం - భోజనం చేశా ననిపించుకున్నది.

ఇల్లు కడిగి బయటికి వచ్చేసరికి తిరిగి, అనిపించింది శశికి...తాను పొరపాటు చేశానా అని... పాపం... అతను బహుశా ఆ స్నేహితుడింట్లో చాలా శ్రమపడి...

గదిలోకి వచ్చింది... రేడియో పెట్టింది... సినిమా రికార్డులు వొస్తున్నాయి. తగ్గు వాల్యూం ఉంచి, కుర్చీలో జేరబడ్డది...తాను పొరబాటు చేసిందా ?

అత నంత నిర్లిప్తంగా ఉండడం ఎందుకని ? దాని కిదే మందు...అని సమాధానం చెప్పుకొన్నది...తాను ఉపవాసం చేసినా, భోజనంచేసి ఎదురుచూసినా, భోజనంచేసి నిద్రపోయినా, అతని కొకటే—అందులో ఎక్కడా పరోపకారం లేదుకనుక. ఆ మాత్రం దానికి తాను ఎందుకు బాధపడాలి ?

ఎన్నో రోజులక్రిందట శశి తాను జీవితంలో చాలా సుఖించగల ననుకొన్నది...అందరిలాగా కాక తన జీవితం బంగారు బాటలలో పయనిస్తుందను కొన్నది... కాని జ్ఞానం వచ్చేసరికి తాను కంటూన్న కలలు కూడా నిద్రావస్థలో నేనని తెలియవచ్చిం దామెకి...తరువాత అవన్నీ కలలేనని తెలిసి వచ్చింది శశికి...సుందరం తనని అడిగినప్పుడు తానేమీ ఆలోచించకుండానే నాన్నని అడుగమన్నది... సుందరం ఆయనని శశికోసం అడిగినప్పుడు ఆయన శశి నేమీ అడుగ కుండానే మాటయిచ్చి శశిని ఇచ్చి పెళ్లి చేశాడు. అయితే,

ఇదంతా ఎందుకు జరుగుతోందో శశి కష్టపడి ఎప్పుడూ ఆలోచించలేదు. ఆమె కొక నమ్మిక ఉంది—తాను సుఖపడతానని. సుందరాన్ని చూస్తే అలా అనిపించేది అందుకే తాను ఏ ఉద్దేశాలూ లేకుండానే అలా ఊరుకున్నది.

పెళ్ళి అయాక సుందరం మనస్సులో పూర్తిస్థానం సంపాదించే ప్రయత్నం తాను క్రొత్తగా చేయాల్సిఉందని త్వరలోనే తెలిసివొచ్చింది శశికి... అతను ఉద్రేకంగా మాట్లాడితే, అది ఎవరి బాధలని గురించో...అంతే. అతను బాధపడితే—అది ఎవరి అవసరాలనీ కష్టాలనీ తలుచుకునో - అంతే.

ఈ సంవత్సరంలోనూ శశి రెండుసార్లు మాత్రం సినిమాకి వెళ్ళింది—అతనితో, అదేనా, నోరువిడిచి అడిగితే - అలాగే అన్నాడు. మరొకసారి తనకి పని ఉందనీ పొరుగువారితో వెళ్ళమనీ అన్నాడు...తనకి చాలా కష్టం అనిపించింది...

అవన్నీ తల్చుకొంటూంటే శశికి ఏదో పెద్ద లోటులాగ కనిపించసాగింది... మొదటినించీ ఇలాగ తన జీవితాన్ని జమా ఖర్చులుగా చూసుకోవడంలో ఆమె చాలా ఆత్రుతచూపింది... కాని, ఎంతసేపూ అతను తనయెడల చూపే గౌరవమూ, నెమ్మదీ, మంచితనమూ జమలలో పడేవి కాని, ఈ ఖర్చులన్నీ ఎప్పుడూ ముందుకొచ్చేవి కావు.

తన నత నేదో మోసం చేసినట్లనిపించింది శశికి... అ ఏకాంతంలో, నిశ్శబ్దంగా ఆమె చేసుకొంటూన్న ఆలోచనలని

రేడియో సంగీతం పాడుచెయ్యడంలేదు... సహాయపడుతోంది కూడా. ఆమె తన ఆలోచనలలో కొట్టుకునిపోతూంది.

కాని—తన కేమిటి కావా లింకా ?

ఆ ప్రశ్నని మాత్రం శశి తరుచు వేసుకుని, "ఇంకేం కావాలి?" అనుకొనేది...ఆ ప్రశ్న ఇపుడు చాలా బరువుగా తనకి కనిపిస్తోంది. మనస్సుని గట్టిగా పరీక్షించుకుని, తన నిజ పరిస్థితులని నిర్ణయించుకోవడానికి ఆ ప్రశ్నకి జవాబు తెలుసుకోవాలి...తన కిక ఏం కావాలి ?

తప్పించుకోవడానికి వీలులేని బలంతో ఈ ప్రశ్న వచ్చింది...ఏం కావాలి?

అతను సాయంత్రం రెండు వందల రూపాయిలూ పట్టుకుని వెడుతూన్నప్పుడు తాను పడిన బాధ జ్ఞప్తికి వచ్చింది శశికి...

"నీ నెక్లస్ ఒక అప్తుడి భార్య ప్రాణం కన్న ముఖ్యమైన దంటావా, శశీ?"

ఉలికిపడ్డది ఆమె......రెండు వందల రూపాయలకోసం తాను సంకుచితంగా ఆలోచించిందని అత ననుకున్నాడు... కాని, తా నెందుకు బాధపడిందో అతనికేం తెల్సు?

తనకేం కావాలో శశికి తెలుసును... సుందరానికి తెలీదు...

ప్రక్కనఉన్న పుస్తకం తీసింది శశి...ఆలోచనలనించి

తప్పించుకోడానికి...నెమ్మదిగా రేడియో ఆఫ్ చేసింది. చదువు తూనే నిద్రపోయింది.

*                    *                    *

అర్ధరాత్రి దాటిఉంటుంది. తలుపు తట్టిన చప్పుడుకి మెలకువ వచ్చింది శశికి...లైటు వెలుగుతోనే ఉంది...చేతిలో పుస్తకం నలుగుతూంది.

కలత నిద్రలోనే లేచి తలుపు తీసింది శశి...తన కళ్లు తడిసిఉన్నాయని ఆమెకి తెలీదు.

లోనికి వచ్చి తలుపువేసి బట్టలు మార్చుకున్నాడు సుందరం. పూర్తిగా తెలివి తెచ్చుకొని కుర్చీలో కూర్చున్నది శశి... గడియారం చూసింది...ఒంటిగంటా ఇరవై అయిదు...

సంవత్సరాలనుంచి తప్పించుకుని తిరుగుతోన్న దోషి లాగ కనిపించాడు సుందరం శశికి...అలాగే చూస్తూ కూర్చున్నది.

బనీను తొడుక్కొని ఆమెవైపు తిరుగుతూ, "నిద్ర పాడు చేశానా శశీ?" అన్నాడు సుందరం.

"కనిపిస్తోందిగా!"

ప్రయత్నం లేకుండానే అన్నది శశి.

"ఆమెకి చాలా ప్రమాదంగా ఉన్నందున-కొంతసేపు ఉండాల్సివొచ్చింది."

"ఆహాఁ..."

"భోంచేశావా?"

"ఆఁ...మీరు..."

"అక్కడ చేశాన్లే..."

"మంచిపని చేశారు..."

"అది కాదు శశీ—అరే! కళ్ళలా ఉన్నాయేం?—ఏడుస్తున్నావా శశీ?"

శశి సిగ్గుపడ్డది...జాగ్రదవస్థలో తాను దాచుకున్న ఉద్రేకాలు నిద్రావస్థలో తనని జయించాయి-తనకి తెలీకుండా.

"లేదు..."

శశి లేచి తన మంచంమీద పడుకొన్నది...అతనితో ఆ పరిస్థితిలో ఇంకా మాట్లాడడం ఇష్టంలేక.

"నామాట విను శశీ...నేను వొద్దాం అనే అనుకున్నాను...కాని అక్కడ చాలా అవసరంగా ఉండాల్సి వచ్చింది...వాడు చాలా గాభరా పడిపోయాడు..."

శశి కష్టంగా ఒత్తిగిల్లింది.

"నీకోపం అందుకేగా!"

"కాదు-కాదు-నన్ను పడుకోనీండి."

లేని కాఠిన్యం వచ్చిందా మాటలలోకి...సుందరం తెల్లబోయాడు. తనకు తెలిసినంతవరకూ శశిలో అంత కాఠిన్యాన్ని అతనెప్పుడూ చూడలేదు.

"సరే..."

ఉదాసీనంగా అని, లైటార్పి పడుకున్నాడు సుందరం. తానింటికి రాలేదని శశికి కోపంగాలేదు...డబ్బు పట్టికెళ్ళి నందుకు...అనిపించింది అతనికి.

* * *

ఉదయం లేచేసరికి శశి తాను క్రొత్త పరిస్థితుల్లోనికి అడుగు పెట్టేనని తెలుసుకున్నది...ఇంతకాలమూ తాను గుర్తించుకోలేని పెద్ద అగాధాన్ని కళ్లు తెరిచి చూడగలిగా ననుకొన్నది.

ఎండిపోయి, నిస్సారంగా తన జీవితం సాగుతోన్నది... తనని ప్రేమించేవారూ, తనకోసం బాధపడేవారూ లేరు...

నిద్రపోతోన్న సుందరంవైపు తేలికగా చూసి, తన పనులకి ఉపక్రమించినది శశి...పళ్ళు తోముకుంటూన్నంత సేపూ ఆలోచన లలాగ పరిగెడుతూనే ఉన్నాయి...

కొద్దిసేపట్లో కాఫీచేసి, తాను త్రాగి, అతనికోసం ఫ్లాస్కులో పోసింది...మరో అరగంటకికాని అతను లేవడు - మామూలుగా అయితే ఇవాళ ఇంకా ఆలస్యం కావొచ్చును.

ఇతరకృత్యాలుకూడా ముగించుకుని గదిలోకి వచ్చింది. శశి...అతనింకా నిద్ర పోతూనే ఉన్నాడు. టైము ఏడున్నర ...పదిగంటలకి బేంకుకి పోవాలి. - చాలా వ్యవధి ఉందిలే- అనుకున్నది.

రాత్రి చదువుతూ వొదిలేసిన పుస్తకం తీసింది... ఎక్కడ ఉందో కూడా గుర్తుకి రాలేదు. నవ్వుకున్నది - ఏం చదువూ!

ఎనిమిదయేదాకా ఆపుస్తకంతో గడిపింది ...సుందరం అప్పటికి నెమ్మదిగా లేచేడు. శశి తన పుస్తకంతోనే ఉండిపోయింది. మామూలుగా తాను అతనికోసం టూత్ బ్రష్ సిద్ధం చేసి, నీళ్ళిచ్చేది...ఆ సంగతే తనకి జ్ఞప్తికొచ్చిందో లేదో...

అతను బయటికి వెళ్లాక రేడియో పెట్టింది - రికార్డుల కోసం...అప్పటిదాకా అతన్ని డిస్టర్బ్ చెయ్యాలేక ఊరుకుని. కొంచెం సేపటికి అతను బయటినుంచి వస్తూ, "ఉదయం రేడియో పెడతావనుకున్నాను...తెలివి వస్తుందని..." అన్నాడు.

"ఏం?" అన్నది శశి - ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోసి యిస్తూ.

"ఉదయం - అక్కడికి వెళ్లాలను కున్నాను..."

"అఁహా..."

ఆవిషయం ఆతను జ్ఞప్తిచేసేసరికి కరగుతోన్న శశి మళ్లా గట్టిపడ్డది.

తొమ్మిదయేదాకా అతను పేపరుచూస్తూ కూర్చున్నాడు. ఆమె వంట పూర్తిచేసింది. తొమ్మిదయాక ఒక్కసారిగా లేచి సుందరం బట్టలు వేసుకోసాగాడు - శశి ఆశ్చర్యపడ్డది...భోజనం చెయ్యకుండా ఆఫీసుకి వెళ్తాడా?

కాని, అడగడం ఆమెకి ఇష్టం లేదు. ఆవిషయం గ్రహిం చనట్లు ఊరుకుంది...అతను బట్టలు వేసుకోవడం ముగించి తొం దరగా వెడుతూ - "వొస్తే మధ్యాహ్నం వస్తాను. నాకోసం చూడకు" అని చెప్పి వెళ్ళాడు.

తెల్లబోయింది శశి...అమాత్రం దానికి అప్పటిదాకా ఎందు కాగాడు?... లేక, తనమీద కోపమా?

తానేం చేశానని? ఆయనని తనపద్ధతులు మార్చుకోమని అనలేదు...అడ్డగించనూలేదు ...తాను చేయాల్సినపనులు తాను చేస్తూనే ఉన్నది...ఎందుకా కోపం?

రాత్రి తానలా అన్నాననా?

తానేమన్నది?...నిద్రరో వచ్చినా ఏమీ అనకుండానే తలుపు తీసింది...బహుశా అతని ప్రశ్నకి ఒక ఉపన్యాసం తాను జవాబుగా ఇవ్వలేదు...అదే నేరం అయితే—కానిమన్నది శశి. అడుగులకి మడుగులు ఒత్తుతూ తాను ఎందుకు సేవచెయ్యాలి.

ఎటొచ్చినా ఆడవాళ్ళమీదికి వొస్తుంది-అనుకుంది శశి. ఎంతో ఉన్నతంగా ప్రవర్తించకపోతే సంకుచితదృష్టి అంటారు. ఆయన ఏదో చెయ్యదలచుకుంటే, తాను పతివ్రత అయితే, "చిత్తం-అంతకన్న గొప్పపని ఏముంది!" అని ఆయనకి నమస్కరించాలి...అలాగ చెయ్యకపోతే, తాను వొట్టి స్వార్థ పరురాలంటారు...ఆయన అలాగే అనుకున్నారు. అలాగ చేస్తే, తన విధిని నిర్వర్తించుకున్నది మాత్రం అవుతుంది.

మానవత్వం-ఆడదానిలో రాక్షసత్వం-అవుతుంది...అని

పించింది శశికి...తలుచుకున్నకొద్దీ తన ప్రవర్తన మానవ మాత్రులకి ధర్మంగానూ, అతని ప్రవర్తన చాలా క్రూరం గ్గానూ, అధికారయుతంగానూ కనిపించసాగింది.

అతను మారిపోయాడనుకున్నది శశి...తాను మారి పోయింది...ఆమె తన జీవితంలో క్రొత్త అధ్యాయం... ప్రారంభమైనట్లు భావించుకున్నది.

*　　　*　　　*

సుందరం ఆ రోజంతా మిత్రుడి ఇంటిదగ్గరే గడిపాడు. గోపాలం అసలే పిరికిమనిషి...దానికితోడు సహాయం చెయ్యా డాని కెవరూ లేరు. రాత్రి అంతా క్రిటికల్‌గా గడిచింది రోగికి.

ఉదయం శశి ప్రవర్తన అతనికి కొంచెం కష్టం కలిగిం చింది. తనతో ఆమె ముభావంగా ఉండడం చూస్తే, రెండు వందల కోసమేనా! అనిపించింది. శశి అలాగ ప్రవర్తించగల దని అత నెప్పుడూ అనుకోలేదు. నెక్లెస్ కొందామని అను కున్నప్పుడు తానామెకోసమే అంతా చేస్తున్నాననే విషయం ఆమెకి తెలీదనీ, దాన్ని వాయిదా వేసినంతమాత్రాన ఆమె అంత కోపగించుకుంటుందనీ, తనని హృదయహీనుడిగా జమ కడుతుందనీ అతను ఊహించుకోలేదు.

తాను గోపాలంకోసం శశితో తగవు పెట్టుకోడం అనవ సరమేమోనని అతని కనిపించకపోలేదు. కొంతసేపు పేపరు వెనుక ఆ విషయమే ఆలోచించుకున్నాడు...కాని - అంత

నిర్దయుడిగా ఉండిపోవడానికి అతని అంతరంగం సమ్మతించ లేదు. "జీవితాలకి కొలతలు రూపాయిలూ అణాలూ కావు- హృదయ సౌకుమార్యమూ, సానుభూతి!" అనుకున్నాడు. భోజనంకోసం కూడా ఉండబుద్ధి వెయ్యలేదు. చివాలున లేచి వెళ్ళాడు.

సాయంత్రం అయేసరికి గోపాలం కుదుటబడ్డాడు. సుందరం ఇంటికి బయలుదేరాడు. సామాన్యంగా ఆసరికి శశి గదిలో కూర్చుని తనకోసం ఎదురుచూస్తూ ఉండేది...రేడియోతో కాలక్షేపం చేస్తూ. కాని, ఇవాళ తలుపు వేసిఉంది.

నెమ్మదిగా తలుపు తట్టాడు సుందరం...రాత్రి నిద్దర చాలకా, పగలంతా తాపత్రయంతోనూ, తల అంతా బాధగా ఉన్నది.

కొద్దిసేపట్లో శశి తలుపు తీసింది. అతను నెమ్మదిగా లోపలికి వెళ్ళి కోటుమాత్రం తీసి, జోళ్లు విప్పి మంచంమీద కూలబడ్డాడు. ఒక్కరోజుకి తానిలా అయాడే! గోపాలం ఎలాగ బాధపడ్డాడో! అనుకున్నాడు.

తలనొప్పి క్రమంగా హెచ్చసాగింది. నుదురు చేత్తో పట్టుకుని పడుకున్నాడు. ఏంచెయ్యడానికీ పాలుపోలేదు. మందు మాత్రం ఏముంది! ఆస్ప్రో మింగాలి. తనకది పనిచెయ్యదు.

శశి కాఫీ తెచ్చింది. తనకి తాగాలనిలేదు. వొద్దన్నాడు. 'ఏం!' అని శశి అడగలేదు-తాను చెప్పలేదు. రెప్పలు బరువెక్కి- క్రమంగా అతను నిద్రపోయాడు.

కాఫీ టేబుల్ మీదే ఉండిపోయి, చల్లారింది. శశి ప్రక్క గదిలో కళ్ళు చింత నిప్పుల్లాగ చేసుకుని ఆలోచిస్తూంది... "ఎందుకా కోపం?" అని.

మరోగంటకి సుందరం లేచి బయటికి వెళ్ళాడు...ఆమె మాట్లాడలేదు. అతనూ పలకరించలేదు.

రెండుమూడురోజులు గడిచేసరికి ముభావంగా ఉండిపోడం ఇద్దరికీ అలవాటైపోయింది. మొదట తన భావాలని అర్థం చేసుకోకుండా సుందరం అలా ఆ డబ్బు దానం చేశాడని శశి కోపగించుకొన్నది; తరవాత అతను తనమీద కోపం తెచ్చుకునేంత మూర్ఖత్వంతో, తన భావాలని గ్రహించలేనందుకు ఆమెకి కోపం వచ్చింది. తనకి కావాల్సింది డబ్బు అని అతననుకున్నాడు; అంతకన్న అడుగు ముందుకువెయ్యలేకపోయాడు.

యాంత్రికంగా అతను భోజనం చేస్తున్నాడు-ఆఫీసుకి వెళ్ళి వస్తున్నాడు-ఆమె ఇంటిపనులు చేస్తూంది. ఆమె ఆ నిశ్శబ్దతని అలవాటుచేసుకుంటూంది. ఆడవాళ్లు ఒక్కసారిమాత్రమే పొరపాటు చెయ్యగలరు...ఆ తరవాత అంతా ఆ పొరపాటు ఫలాన్ని అనుభవించడంతోనే గడుపుకుంటారు-అనుకుంది శశి. తానా అనుభవానికి సంసిద్ధురాలు కావడమే లక్ష్యం చేసుకున్నది.

ఒక నెల సుమారుగా అలా గడిచిపోయింది-నిశ్చయంగా శశి జీవితం కొత్తమార్గంలో సాగిపోతూంది. ఆమెకి ఉన్నదల్లా ఒక్కటే ఆలోచన; తా నతని దృష్టిలో ఉన్నంత నీచురాల్ని కానని ఎలాగ తెలియజెయ్యడమా అని.

జీతం వచ్చినరోజు అందరూ హుషారుగా ఉంటారు-రాబోయే కొద్దిరోజుల సౌఖ్యాలని తలుచుకుని. కాని సుందరం హుషారు, దగ్గర డబ్బుఉంటే, తనదగ్గర చెయ్యిచాచినవాడు ఊరికే పోనక్కరలేదనే.

ఈ నెల జీతం చేతికి రాగానే, సుందరం ఆలోచనలు ఇంకోలా పరిగెట్టాయి-గోపాలానికి తాను క్రిందటినెల జీతం ఇచ్చినదగ్గరనుంచీ శశి వాలకం అతనికి చాలా కష్టం అనిపించింది. వాస్తవంగా తాను ఆమెని చాలా ఉన్నత దృక్పథం కలదాన్నిగా భావించాడు-ఇప్పటిదాకా ఆమె అలాగే కనిపించింది-పనుల్లోకూడా. కాని, అప్పటినుంచీ ఆమె తన భావాలని, నిజాన్ని దాచి బయటపెడుతోందని అతను తెల్సుకున్నాడు. కొంచెం డబ్బుకోసం తనతో కలహించే శశిని, మరికొంచెం డబ్బుతో కొనుక్కో-వచ్చును-అనుకున్నాడతను.

దైవికంగా పాతబాకీ ఏదో ఆ రోజే తిరిగి అందడంతో అతని చేతిలో అయిదువందలదాకా కనిపించాయి. అన్నీ పర్సులో ఉంచుకుని అతను సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఏదో చదువుకొంటూన్న శశి లేచివెళ్ళి ఫ్లాస్కు తెచ్చి టేబిల్ మీద ఉంచి తన పనిలో నిమగ్నురాలైంది.

అది మామూలు కార్యక్రమం అయిపోయింది. క్రీగంటితో అటుచూస్తూ సుందరం "కప్పులో పోస్తావా?" అన్నాడు.

శశి జవాబివ్వకుండా లేచి, కప్పులో కాఫీ పోసి తిరిగి తన పనిలోకి వెళ్ళిపోయింది. నిశ్శబ్దంగా కాఫీ తాగడానికి అల వాటుపడిన అతను ఇలా అనడం ఆమెకి ఆశ్చర్యం కలిగించక

పోలేదు; కాని, ఆ భావాలని పుస్తకంలోని అక్షరాల్లో ఆమె దాచుకోనగలిగింది.

కాఫీ త్రాగి, సుందరం కుర్చీలో కూర్చుని సిగరెట్ ముట్టించాడు.

"సినిమాకి పోదామా ?" అన్నాడు ఇంకేమీ పనిలేనట్లు.

పుస్తకం వెనకనించే "మీరు వెళ్లండి" అన్నది శశి.

"నువ్వు ?"

"నేను-రాను."

"ఏం ?"

"రావాలని లేదు"

"ఎంచేతో ?"

"వొచ్చిన ప్రతీ సినిమాకీ నేను విధిగా బయలుదేరడం లేదనుకుంటాను..."

"అలా లేదు కనుక నే..."

"సరే...నేను రాను"

ఒక నిముషం నిశ్శబ్దం ఆవరించుకొన్నది.

"శశీ!" అన్నాడు సుందరం.

"ఊఁ...?"

"ఇంక-నాతో మాట్లాడవా?"

"ఇప్పుడు మాట్లాడడంలేదా?"

"అలాక్కాదు...కొద్దికాలం క్రితం చూశావా-ఎంత సరదాగా ఉండేదానివో! ఎంత చక్కగా మాట్లాడేదానివో!-అలా"

శశి మాట్లాడలేదు. ఆమెకి ఈ సంభాషణ బాధ కలుగ జేస్తూన్నా, ఆ పూర్వపు దినాలని జ్ఞప్తికి తెస్తూన్నా, సుందరం నిజం గ్రహించాడేమోననే ఆశ కలుగసాగింది.

"చెప్పు శశీ!"

"ఏమని?"

"ఒక చిన్నవిషయంకోసం, నన్ను నీకు దూరం చేశావు. నేను చేసింది పొరపాటు కావొచ్చు-కాని, అందుకోసం ఇంత చెయ్యాలంటావా?"

శశికి ఈమాటలు సూటిగా తగిలాయ్-తనదే పొరపాటు అని అతని ఉద్దేశం.

"నేనేం చెయ్యలేదు..."

"మరి-నువ్వు చాలా మారిపోయావ్!"

"క్రొత్త విషయాలు తెలిసినప్పుడు మనుషులు క్రొత్త మార్పుల్ని పొందుతూ ఉంటారు..."

"నీకు తెలిసింది-"

"మీకూ తెలుసును"

సుందరం ఏమీ అనలేక ఊరుకున్నాడు...తరువాత ఏం చెయ్యడమో అతనికి బోధపడలేదు...తాను హృదయం ఇచ్చిన ఈ ఒక్క జీవి తనబాకీ ఎగవేస్తే తానేం చెయ్యగలడు!

"పోనీ-ఒకటి చెప్పు శశీ...డబ్బు నేను ఎలాగో నీకు తెచ్చియిస్తే నువ్వు కోపం తగ్గించుకుంటావా?"

శశి చిరాకుగా లేచింది-సుందరం హృదయంలో ఉన్న భావాలమీద ఆమెకి చాలా అనుమానం ఉంది...కాని, అవి ఇంత నీచంగా ఉంటాయని ఆమె అనుకోలేదు. ఆమె ఏమీ మాట్లాడకుండా ఊరుకుంది.

"వెళ్ళకు శశీ-చెప్పు..."

సుందరం నెమ్మదిగా ఆమెదగ్గరికి వచ్చాడు. ఆమె అటు తిరిగింది. రెండుభుజాలతోనూ ఆమెని తనవైపు తిప్పుకుంటూ--"నా మనసులో బాధ నీకు తెలుసును శశీ... నువ్వు కూడా నన్ను విదిలించివేస్తే నాకు శాంతి ఉండదు...చెప్పు" అన్నాడు.

శశి అతని కళ్ళల్లోకి సూటిగా చూసింది ... అలాగే చూస్తూ ఉండిపోయింది.

"ఇవిగో శశీ...అయిదు వందలు. నీకేం కావాలన్నా కొనుక్కో. నేనూ వస్తాను..."

అతను పర్సులోనుంచి డబ్బుతీసి డ్రాయర్లో ఉంచాడు. శశి అటు చూడ లేదు...నిజానికి ఆమె అతని కళ్లనించి తన చూపుని మరలించలేదు...'ఏమిటి తనంటూన్నది? తన మనస్సుని రూపాయిలతో కొంటాననా?...ఎంత

చవక అయిపోయాను! హృదయా లెంత సులువుగా దొరుకు తాయి!' అనుకున్నది.

"నేను-నా ఉద్దేశాలతో దూరమయి నీకు పొరపాటు చేశాను శశీ...నీ ఉద్దేశాలనే మరిచిపోయాను. ఈ కలహాన్ని పెంచడం నా కిష్టంలేదు...అది నీ డబ్బు. నీ యిష్టంవచ్చినట్లు వాడు..."

శశి వింటోంది...జవా బివ్వలేని స్థితిలో ఉంది. నెమ్మ దిగా అతని చేతులు విడిపించుకుని కుర్చీలో కూర్చున్నది.

ఎవరో తలుపు తట్టారు.

చికాకుగా వెళ్ళి సుందరం తలుపు తీసి- "అరే! నువ్వా! ఇలా ఉత్తరమైనారాయ కుండా వచ్చావేం?" అన్నాడు... మరుక్షణం ఇంట్లోకి శ్యామలని తీసుకొస్తూ.

"ఏం వొదినా!...కులాసా?"

ఆ మాటలు వినిపించేసరికి మళ్ళా ప్రపంచంలో పడింది శశి...ఆమెని పలుకరించి యోగక్షేమాలు అడిగి, కొంత కుదుటపడ్డది.

శ్యామల సుందరం చెల్లెలు...ఒక్కర్తీ. ఆమె భర్త మద్రాసులో ఉద్యోగం చేస్తున్నాడు. జీతం తక్కువ కావడాన్న అడపా తడపా సుందరం సాయపడుతూనే ఉంటాడు...కాని, ఇంతహఠాత్తుగా రావడానికి కారణం ఏమిటో శశికీ, సుందరా నికీ కూడా అంతుపట్టలేదు.

శశికి తన విపరీత పరిస్థితినించి దైవికంగా తప్పుకోగలిగి నందుకు కొంత సంతోషంగానే ఉంది

రాత్రి సుందరమూ, శ్యామలా భోజనాలు చేశాక, శశి భోజనం చేస్తూన్నది. అవతలి గదిలో వాళ్లిద్దరూ మాట్లాడు కుంటున్నారు.

"...ఆయన్ని నాలుగు వొందలూ డిపాజిట్ కడితేగాని వాళ్లు ఉద్యోగం చెయ్య నివ్వరుట అన్నయ్యా!...ఈ వారంలో కట్టక తప్పదుట...అందుకని..."

సంగతంతా బోధపడింది శశికి......ఆ మొత్తంకోసం వచ్చింది.

కొన్ని నిమిషాలు ఊరుకుని, మెల్లిగా సుందరం— "నాదగ్గర ఏమీ లేదే...ఎలాగ?" అన్నాడు.

శశి చాలా ఆశ్చర్యపడింది...శ్యామల అంటే ప్రాణం సుందరానికి. అతనే ఇలా అంటున్నాడా?

"ఈ వారం ఇవ్వకపోతే......ఆయన ఉద్యోగానికి నీళ్ళు వొదులుకోవాలి..." బాధగా అన్నది శ్యామల.

అతనేమీ మాటలాడలేదు...శ్యామల ఆలోచనలు పరి పరి విధాల పోతున్నాయ్. అతనెందుకని అలాగ అన్నాడు?... ఆమెకి ఇవ్వడం ఇష్టంలేదా?.....శ్యామలకోసం అతను ప్రాణ మన్నా ఇవ్వ సిద్ధమౌతాడే!

"కొంచెం ముందుగా రాస్తే ఏదో చేద్దును...ఇప్పుడు చికాకు వచ్చిపడ్డది... సరే...ఉండు. చూద్దాం!"

"నేను—రేపు మెయిలుకి వెళ్ళాలి!"

"రేపా?"

"ఆ...ఆయనకి మతిపోయింది. దగ్గర నేనూ ఉండక పోతే ఎలాగ!...ఇంకా వారం టైం ఉందిలే..ఎక్కడైనా కుదిరితే పంపు—నువ్వుమాత్రం ఏం చేస్తావు!"

అక్కడికి ఆ సంభాషణ అంతంఅయింది. శశి ఆశ్చర్యం మాత్రం మితిమీరిపోయింది. సుందరం చెల్లెలితో తన ప్రాణ సమానంగా చూసుకొంటోన్న శ్యామలతో—తన దగ్గర ఉంచు కున్న అయిదువందలు లేవని అబద్ధం ఆడుతున్నాడు!

కాని ఆ విషయాన్ని నమ్మలేకపోయింది శశి...ఇందులో ఏదో పొరబాటు...అవును...ఆడబ్బు తన కిచ్చినట్లుగా లెఖ్ఖ వేసుకుని ఉంటాడు సుందరం........

సాయంత్రం ఆ నిమిషంలో శ్యామల రావడాన్నించి శశి ఈవిషయంగురించి తీవ్రంగా ఆలోచించడానికి వీలుకాలేదు. అందులోని సత్యం ఇప్పుడు తనకి తెలుస్తున్నది...అతను తనకి అయిదువందల రూపాయిలిచ్చి... మళ్లా అనుకున్నది శశి... ఈసారి కోపంతోనూ, అసహ్యంతోనూ — "రూపాయి లిచ్చి నన్ను కొంటారుట!!" అని.

పనులు ముగించుకుని గదిలోకి వచ్చేసరికి శశి మనస్సంతా చాలా చిరాకుగా ఉన్నది... సాయంత్రం సుందరం డ్రాయరు లో ఉంచిన డబ్బు ఆమె కళ్లపడడంతో ఒక్కసారి ఆ భావా లన్నీ వెలికివచ్చాయి.

అవతల శ్యామల నిద్రపోతోంది... సుందరం వాసాలకి కళ్ళని ఒప్పజెప్పి ఏమిటో ఆలోచిస్తూన్నాడు.

మనసులో ఉన్న భావాలన్నిటినీ దాచుకుని, నెమ్మదిగా "అయితే — ఆడబ్బు మీది కాదన్న మాట!" అన్నది శశి.

"ఏ డబ్బు?"

"సాయంత్రం తంది..."

"కాదు — అది...నీది".

"అలాగా!... దానంచేశారా?"

"లేదులే...బాకీ తీర్చాను"

"నాకు మీరు బాకీ ఏమీ లేరే!"

"నీకు తెల్సు—"

మంచంమీదని ఉన్న సుందరం పక్కకి పర్సుని విసిరి, "మళ్ళా అలా అన్నా, డబ్బు ఇచ్చినా — మనకి ఆనాటితో చెల్లు" అన్నది శశి...చిన్న కంఠస్వరంతోనైనా, చాలా వాడిగా,

"శశీ—!"

"మరేమీ అనబోకండి...ఆవిడకి ఇచ్చినా సరే...మరేం చేసినా సరే. మనుష్యు లందరికీ ఉంటాయి మానమూ మర్యాదలూను..."

శశి ఇంకేమీ మాట్లాడలేదు—సుందరమూ నోరు కదపలేదు. సంపెంగ అని కౌగిలించుకుంటే నాగు ముద్దు పెట్టు

కున్నట్లు అతను బాధపడుతున్నాడు..."పశువు!" అని ఒకసారి మనసులో అనుకున్నాడు.

ఉందయం శ్యామల డబ్బు తీసుకుని వెళ్ళిపోయింది.

*　　　*　　　*

మర్నాడు సాయంత్రం ఆఫీసునుంచి రాగానే సుందరం కాఫీ త్రాగకుండా బయటికి వెళ్ళిపోయాడు. రెండోనాటి నుంచీ శశి సాయంత్రం అతనికి కాఫీ ఉంచడమే మానింది. మూడోరోజున అతను కాఫీ అడిగాడు. లేదన్నది. సరేనన్నాడు. వెళ్లి హోటలులో త్రాగాడు.

ఆలోచించినకొద్దీ అతనికి జీవితం దుర్భరం కాసాగింది–శశిమీద కోపం హెచ్చసాగింది. ఇంట్లో అడుగు పెట్టడం అంటే అతనికి ముళ్ళమీద అడుగు వెయ్యడంలా ఉన్నది... తానేం చేశాడని శశి ఇలాగ పగసాధిస్తూంది?...ఆమెకేంలోటు చేశాడు?

ఆమెని తాను ప్రేమించాడు...తమ కిద్దరికీ మధ్య తెరలు లేవనుకున్నాడు...అందుకనే, అంత నిస్సంశయంగా ఆమె దగ్గరి డబ్బుకూడా తన మిత్రులకీ, అవసరంలో ఉన్నవాళ్లకి ఇవ్వడానికి తీసుకోగలిగాడు. ఇంత నీచంగా ఆమె ఆలోచిస్తుందని తానెన్నడూ అనుకోలేదు

ఆమెకి కోపం వచ్చినా తాను సర్దుకుని తిరిగి ఆ డబ్బు ఆమెకే ఇచ్చేశాడు...ఆమె ఇష్టంవచ్చినట్లు చెయ్యమని. కాని–అంత వాడిగా ఆమె దానిని తిరస్కరించడం ఎందుకు?

తనకి తెలుసును—మూర్ఖత్వం. ఒకసారి చేతులనించీ దాటాక ఆడవాళ్ళు ఇలాగే పరిస్థితుల్ని అధ్వాన్నం చేస్తారు. చివరకి. చివరకి...

ఒళ్ళు జలదరించింది సుందరానికి. చివరకి—ఏమౌతుంది?

రెండేళ్లక్రితం డాక్టర్ అన్న మాట లెందుకో అతనికి జ్ఞప్తికి వచ్చాయి... "జాగ్రత్త సుందరం! నీకు హార్టు చాలా నీరసంగా ఉంది..." అతను తన మిత్రుడు. తాను నిజం తెల్సుకుంటేనే మంచిదని చెప్పేడు..."ఏమీ బాధలేదు — కొంచెం నిర్విచారంగా ఉండడం నేర్చుకో..."

తానేమైపోతున్నాడు?...గత రెండు నెలలనించీ తన మనస్సుకి బొత్తిగా శాంతి లేకుండాపోతూంది. అందుకే ఆరోగ్యం చెడుతోందా?

ఒక్కసారి అతన్ని దైన్యం ఆవరించింది...తానలా బాధపడితే ఎక్కువ కాలం బ్రతకడు....ఆసంగతి తనకి తెలుసు కాని-శశి...

నెమ్మదిగా ఇంటి వైపు నడిచాడు. సంజ వెలుగులు క్రమంగా చికట్లకి తావిస్తున్నవి. గుమ్మందగ్గర నిలబడి, తెరచి ఉన్న తలుపులు తోశాడు. ఒక్కసారి నీరసం ఆవరించినట్లయింది. నెమ్మదిగా గదిలోని కుర్చీలో చేరబడ్డాడు. రేడియో సన్నగా పాడుతోంది — శశి మరో కుర్చీలో కూర్చున్నది. అతని రాకనే గమనించనట్లు ఆలోచిస్తూంది.

కొద్ది నిమిషాలున్నాక, నెమ్మదిగా లేచి రేడియో కట్టేశాడు సుందరం. మొదట కొంచెం ఆశ్చర్యపడినా, ఆ ఆశ్చర్యాన్ని దాచుకుంది శశి.

"నీతో మాట్లాడాలి శశీ!"

ఆమె జవాబివ్వకుండా అలాగే కూర్చున్నది — సుందరం నెమ్మదిగా బల్లమీద సగం కూర్చున్నాడు. దీపపు కాంతులు ఆమె ముఖంమీద పడి కళ్ళల్లో ప్రతిఫలిస్తున్నాయి ...ఒరోజుని తానా కళ్లల్లో ఆనందలోకాలు దర్శిస్తానని కలగన్నాడు.

"ఎంత కాలం ఇలాగ—మూగకాపరంచేద్దాం శశీ?"

ఆమె ఒకసారి తల ఎత్తి తిరిగి దించుకున్నది.

"నేను చాలా బాధపడుతున్నానని ఏ మాత్రం హృదయం ఉన్నా నువ్వు గ్రహించగలవు శశీ!... మొదట నేను అనాలోచితంగా తొందరపడి ఉంటాను ... కాని, నీకు కష్టంకలిగించడం నాకెన్నడూ ఇష్టం ఉండదు. సరి దిద్దుకుందామనుకున్నాను..."

అతను కుర్చీలో కూర్చొని జవాబుకోసం ఆమెవంక చూశాడు...ఆమె ఏమీ మాటలాడకుండా ఆలోచిస్తూన్నది.

"ఒక్కసారి అనంతంలోకి జరిగిపోయిన క్షణాన్నీ తిరిగి వెనక్కి తీసుకురావడం ఎంత అసంభవమో, జరిగిన విషయాలని రద్దు చెయ్యటం అంతేననీ — నీకు తెలుసును. మానవమాత్రుడుచేసేది తనకి సాధ్యమైనంత వరకూ జరిగినదా-

నికి ప్రతిక్రియ చెయ్యడమే, అదే చేశాను. ఏం చెయ్య మంటావు?"

"నేనేమీ చెయ్యమనలేదు—"

"కాని — ఇలాగ మూగగా, ఎడారి లాగ, జీవించడం అసంభవం శశీ!"

"తప్పనివిషయాలకి సరి పెట్టుకోవడం — మానవ మాత్రులు చేసేపని!"

"అంతేనా శశీ?"

"అతురాలా"

లెంపకాయతిన్నా సుందరం అంతబాధ పడేవాడుకాడు. తన సౌమ్యతి ఇలా వ్యర్థం అయిపోతుందని అత నెప్పుడూ అనుకోలేదు. అతని హృదయంలో ఉన్న అర్ద్రస్థానాల్ని త్వరగా కోపం ఆక్రమించుకున్నది.

"అయితే - నువ్వు ఇక్కడ ఉండడమూ అనవసరమే - "

తొందరగా అనేశాడు... శశి షాక్ తిన్నట్లు కుర్చీలో నుంచి త్రుళ్ళిపడి తిరిగి సద్దుకుని, "సరే - " నన్నది.

సుందరం తిరిగి బయటికి వెళ్ళిపోయాడు. తాను తొందర పడ్డాడు... అనుమానమే లేదు. కాని - శశి ఏమీ కదలలేదు...తాను తొందరపడ్డాడు...ఔను...

ఆమె వెళ్ళిపోతుందా? నిజంగా...వెళ్తుంది-తప్పకుండా. ఆమె కున్నంత అభిమానం ఎవ్వరికీ ఉండదు...కాని—డబ్బు?

తానివ్వాలా?-ఇవ్వడు...ఎలా వెళ్తుంది?... వెళ్ళదు...కాదు డబ్బు ఎలాగైనా సంపాదిస్తుంది-వెళ్తుంది..ఆమె మాటలు పడదు... పోనీ...వెళ్ళి క్షమాపణ...ఆమెకది సరిపడదు...

కెరటాలలాగ ఆలోచనలు వొచ్చి పడుతున్నాయి... సుందరాని కే ఆలోచన తోచడంలేదు. పార్కులో కూర్చున్నాడు...బయటికి వచ్చాడు. ఎనిమిది దాటింది ఇటూ అటూ తిరిగాడు...తొమ్మిది...ఇంటివైపు మళ్లాడు.

నిశ్శబ్దంగా ఆమె వడ్డించింది-ఏమీ తినలేకపోయాడు, "తొందరపడి అన్నాను-నా ఉద్దేశం అదికాదు శశీ!" అనడానికి ప్రయత్నించాడు-మాటలు దొరకవు- శబ్దాలు రావు-తనలోనే తాను అనుకోబోయాడు-మౌనంగానే లేచాడు...

కొన్ని నిమిషాలయాక ఆమె వచ్చి పడుకున్నది-అతను ఏమీ మాటలాడలేక పోయాడు-ఆ యిద్దరూ ఆ స్థితిలోనే ఉన్నారు...

ఉదయం.

అన్నీ యాంత్రికంగా జరిగాయి... మౌనంగా. అతను భోజనంచేసి ఆఫీసుకి వెళ్ళాడు.

శశి గదిలోకి వచ్చింది. తనతో తెచ్చుకున్న సూట్ కేసులో బట్టలూ, రెండు పుస్తకాలూ పడవేసుకుంది. తనకోసం అల్లుతున్న వూలుపులోవరూ, అన్నయ్య ఇచ్చిన శాలువా సంచీలో ఉంచుకుంది... చేతిగాజుల జత తీసి పొట్లం కట్టింది —బంగారపు దుకాణం ఆ వీధి చివరనే ఉంది.

మూడు గంటలు...

కూతవేసి మెయిల్ స్టేషన్‌ని దూరం చేసుకుంటూన్నది-కష్టంగా కదిలిపోతూ. శశి తన కంపార్ట్‌మెంట్‌లోనించి ఒక సారి బయటికి చూసింది...కళ్లు వద్దన్నా నీళ్లతో నిండి పోయాయ్...తాను పొరపాటు...

అన్ని మాటలనీ తుడిచిపెట్టి తొందరగా లోనికి వచ్చి ఒక మూలనకూర్చున్నది. పుస్తకం తెరిచింది...సామాన్యంగానే కన పడాలని. అవతలిప్రక్క ముగ్గురు అమ్మాయిలు-కాలేజీవాళ్ల ల్లే ఉన్నారు-కూర్చున్నారు..ఒకామె తనవంక చూస్తున్నది...తనతో సంభాషణ మొదలుపెడితే బాగుండును—

"ఆ పుస్తకం ఏమిటండీ?"

తనకి ధైర్యం వచ్చింది-మరి కొద్ది క్షణాల్లో తన స్నేహి తురాలైంది ఆమె..మిగిలిన వాళ్ళూను.

తాను అన్నయ్యకి టెలిగ్రాం ఇచ్చింది-స్టేషన్‌కి రమ్మని. బెంగలేదు...

సాయంత్రం సుందరం ఇంటికి వచ్చేసరికి తాళం వేసి ఉంది-ప్రక్క ఇంటి వాళ్ళు తాళం ఇచ్చారు. తలుపు తీసి మం చంమీద కూలబడ్డాడు...అంతపని చేసింది! అతని తల తిరిగినట్ల యింది-అంత తొందరగా శశి వెళ్ళిపోయిందా?...

దేన్నోకోల్పోయినభావం అతన్ని బలంగా ఆవరిస్తూన్నది కాదు-కాదని ఎంత వాదించుకున్నా ఆగకుండా ఎక్కువ తూన్నది ఆ శూన్యభావం...తల పట్టుకున్నాడు-దుర్మార్గురాలు

అనుకున్నాడు...తన స్వభావాన్ని అర్థంచేసుకోకుండా జీవితం నరకప్రాయం చేసింది!...

అతను అఫీసుకి వెడుతున్నాడు-వొస్తున్నాడు...యంత్రంలాగ. స్నేహితులందరు అడుగుతారు-అతను కారణం చెప్పడు...

మూడు నెలలు...

అతను శశిని మరిచిపోవాలనే అనుకున్నాడు నిశ్చయించుకున్నాడు...కాని అనుక్షణమూ ఆమె జ్ఞప్తికివస్తుంది... తానన్న మాటలు జ్ఞప్తికివస్తాయి..తాను నేరం చేశానని బాధపడతాడు...తనతో తానలాగ కాదని వాదించుకుంటాడు. పూర్వం ఆ ఇంట్లో ఆనందంగా గడిపిన రోజులూ, గంటలూ, క్షణాలూ జ్ఞప్తికి వస్తాయి-కళ్ళు తడి అవుతాయి...మళ్ళా ఎప్పుడైనా అలాగ ఆనందంగా ఉండగలనా! అనుకుంటాడు...ఈ సారి కన్నీళ్ళు నెమ్మదిగా...

త్వరగా వీధిలోకి వెళ్లిపోతాడు... అటూ ఇటూ తిరుగుతాడు - హోటల్లో భోజనం చేసివస్తాడు...డీగాలుగాఆకుర్చీలో కూర్చుంటాడు. ఒక్కొకక్కప్పుడు రేడియో పాడుతూ ఉంటుంది... అలాగ రాత్రి జాగరం చేస్తాడు.

మళ్లాఉదయం...మళ్లామధ్యాహ్నం-సాయంత్రం-రాత్రి

"సారీ మిష్టర్-ఏమీ చెప్పలేము... హార్ట్ చాలా బలహీనంగా ఉంది...ఏమీ ప్రమాదము లేకపోవచ్చును. Fatal కావచ్చును...Excite కానివ్వకండి..."

నెమ్మదిగా కళ్ళు తెరిచాడు సుందరం. నీరసంగా ఉంది.-తానెక్కడ...అరే!...గోపాలం...భార్య...ఏమిటిది?

ఒక్కసారి నుదురు జివ్వుమన్నది.

నెమ్మదిగా జ్ఞాపకం రాసాగింది సుందరానికి...సాయంత్రం తాను రోడ్డుమీద నడుస్తూంటే-సైకిల్...బ్రేకులు పట్టలేదు...తాను పరిగెట్టాడు పక్కకి-పడ్డాడు...రాయి నుదురికి-బలంగా...

ముఖంఅంతా చెమట పోసింది...మళ్ళా అతను అర్థ చేతనస్థితిలోకి జారిపోయాడు...

"మీ అడ్రస్ తెలీక-నిన్నటిదాకా Wire చెయ్యలేదండీ-నిన్నను తెలివి వస్తే అడిగాను..."

ఎవరొచ్చారని కళ్ళు తెరిచి చూశాడు సుందరం...అవును-శశి...

ఆమె నిర్వికారంగా గదిలోకివచ్చి తన సామాను లోపల పెట్టించింది. అత నామె వైపే చూస్తున్నాడు. జట్కావాడిని డబ్బిచ్చిపంపి, ప్రక్కగదిలో ఉన్న గోపాలం దగ్గరికి వెళ్లి-"డాక్టర్ ఏమన్నాడు?" అన్నది.

"కొంచెం ప్రమాదం ఉందేమోనని..." విచారంగా, అనుమానంగా చెప్పాడు గోపాలం...

"అహాఁ..."

శశి పొడిగా అన్నది. గోపాలం ఇంటికి వెళ్లినట్లుంది-శశి తిరిగి ఆ గదిలోకి వచ్చింది. మంచంమీద సుందరం. తలకి కట్టుమాత్రం వుంది.

ఆమె అటు చూసింది.

అతను మళ్ళా కళ్లు తెరిచాడు-కొంచెం శక్తి వచ్చిన ట్లుంది. ఆమెవైపు చూశాడు.

"ఏమైనా కావాలా?"

నర్స్‌లాగ-నిర్వికారంగా అడిగింది శశి.

"ఆ!...నువ్విలాగరా"

నెమ్మదిగా వెళ్లి అతని ప్రక్క నిలబడింది శశి.

"ఆ కోటుజేబులో తాళాలు ఉంటాయి.. నా పెట్టె తీసి, అడుగుని ఎర్ర కవరు ఉంటుంది తీసుకురా..."

కొద్ది నిమిషాలలో శశి అలా చేసింది.

అతను కవరు తీసుకుని నెమ్మదిగా మంచానికి జేరబడి కూర్చున్నాడు.

"నాకు—ప్రాణభయం ఉందిటగా?"

"తెలీదు."

"డాక్టర్ ఉందని చెప్పాడు."

"అనుమానం..."

"కాదులే—నాకు తెలుసు..."

శశి హృదయం ఒక్కసారి విరుచుకున్నది-కాని పైకి ఆమె నిర్వికారంగానే కూర్చున్నది.

అతను ఆ కవరులోనించి ఓ కాగితం తీశాడు...అది అతని ఇన్స్యూరెన్స్ పాలిసీ...పది వేలకి.

"చూడు"

శశి నిర్జీవంగా తీసుకుని చూసింది. ఆ విషయం ఆమె కింతకుముందు తెలీదు.

"ఈ పదివేలూ——ఎవరివంటావ్?"

శశి అర్థం కానట్లు చూసింది.

"Nearest kin...అంటే భార్య... చూడు శశీ...ఒక టడుగుతాను చెప్పు...ఒక జీవితం ఖరీదెంత అంటావు?"

ఆమె మాట్లాడలేదు.

"నా జీవితం ఖరీదు?...నీకు చాలా తక్కువ అని నాకు తెలుసు...కాని-పదివేలు...నాకు చాలా సంతోషంగా ఉంది శశీ... బ్రతికి ఉన్నన్నాళ్ళూ నీ కోరికలు తీర్చలేకపోయాను-సరిగా క్లెయిమ్ పెడితే రెండునెలల్లో వొస్తుంది డబ్బు-పదివేలు!!"

అతను ఆ కాగితాన్ని కవర్లో ఉంచి ఆమె కిస్తూ, "తీసుకో" అన్నాడు.

శశి చెయ్యి జాపలేదు.

అతను బలంగా ఆమె చెయ్యి తీసుకుని ఆ కవరు వ్రేళ్ళ

మధ్య ఉంచాడు...ఒక్కసారి శశి రెండుచేతులతోనూ ఆ కవర్ని పట్టుకుంది...

"మీ—వగ కాదూ?"

అతను వికటంగా చిరునవ్వు నవ్వాడు.

"ఛా...నువ్వంటే నాకు చాలా ప్రేమ శశీ!.. నీకు కావాల్సింది నీ కివ్వాలి... నా జీవితంపోతే అది ఖరీదు..." అతని గొంతు గాద్గదికం అయింది.

శశి తొందరగా కవర్ని అతని ప్రక్కన ఉంచింది... నిర్విణ్ణ అయి ఆమె చూస్తోన్నది.

"మీ బ్రతుకు-పదివేల ఖరీదు మీకూ కంపెనీ వాళ్లకే కావొచ్చు...నాకు కాదు..."

"ఇంకా—"

"అవును-నాకే మూర్ఖత్వం అంటగడుతున్నారో దాని తోనే మీరు బాధపడుతున్నారు.. ఒక జీవితం విలువ ఎంత అని అడిగారు...చెప్పండి-ఒక మనస్సు విలువ ఎంతా?"

అతను మాటలాడలేదు...

"బంగారు తెరలలోనించీ ఏమీ కనిపించవు. హృదయా లని జాలితో అర్థంచేసుకో ప్రయత్నించకపోతే ఏమీ కనిపించవు, మీ ఉద్దేశం-నేను డబ్బుకోసం మీతో-దెబ్బలాడే ననేగా?

"అవును-జీవితాలకీ, మనుసులకీ. మనుష్యులు రూపా యలూ అణాలతో విలువ కట్టినంతకాలం బ్రతుకులు మన బ్రతు

కులలాగే వెలుగుతూ ఉంటాయి...నేను ఏడ్చినది మీ వందల కోసంకాదు...దాని వెనుకఉన్న నిర్లక్ష్యంకోసం...మీ డబ్బు కోసంకాదు దాన్ని మీరు 'బాకీ' తీరుస్తారు...కాని, నాకు కావాల్సింది మనస్సు...అందుకనే మీ ఉద్దేశం తెలిశాక మీతో జీవించలేననే నిర్ణయానికి వచ్చాను-వెళ్ళి పోయాను"

సుందరం ఒక్కసారి ఆమెవైపు చూసి తలదించు కున్నాడు.

"ఆవిషయం నువ్వు చెప్పలేదు..."

"మీ కళ్ళకి కనిపించినవే రూపాయలూ అణాలూ...ఈ విషయాలు వాటిలోనించి కనిపించవు. ఇప్పుడు ఆ తెరలు కొంచెం తొలగించాను-అంతే...మనస్సు ఖరీదు-మనసే"

"బాగా కనిపిస్తోంది శశీ..."

అతను పశ్చాత్తాపంతో అన్నాడు...బాధ అతని ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

"కాకపోయినా బాధలేదు..."

"అవును.. మనస్సులూ కాలమూ పరిగెట్టేది ఒక్కదిక్కులోనే! వెనక్కిరావు..."

"వొస్తాయి శశీ...మనం తల్చుకుంటే...పొరపాటుపడినా, క్షమించడం మానవత్వం..."

"వొద్దులెండి-మానవత్వంమీద ఉపన్యసించకండి...మీకీ మాటలు ఎన్నడూ చెప్తాననుకోలేదు-కాని ఉద్రేకం ఆపుకోలేక పోయాను...మీరింక పడుకోండి"

"పడుకుంటాను శశీ-నాకు తెల్సును. కాని, నువ్వు నన్ను మనసారా క్షమించావను...శాంతిగా కళ్లు మూసుకుంటాను."

"అనను...అననని మీకు తెల్సును."

"చనిపోయేవాళ్ళమీద కూడా నీకు జాలి లేదా శశీ?"

"మరణం పేరున నన్ను భయపెడుతున్నారు.. కాని-మిమ్మల్ని ఎందుకు క్షమించాలో నాకు తెలీదు...ప్రతీవారూ మీలాగే ఆలోచిస్తారు...అందుకని నేను మీమీద కోపం తెచ్చుకోలేదు. చెప్పానుగా-ఒక్క-చోట మనం జీవించడం అసంభవం అని అనిపించింది...వెళ్ళాను. మీమీద నాకు కోపమూలేదు. మానవత్వంలో ఈ లోపాలూ ఒక భాగమే...

"పోనీ-ఒకటి చెప్పు శశీ...నేను చచ్చిపోతే నీకు విచారంగా ఉంటుందా?"

"మీరు చాలా దుష్కరమైన ప్రశ్న వేస్తున్నారు... నేనెలా అనుకున్నా మీకు వచ్చేలాభం ఏమిటి?"

"ఆత్మశాంతి..."

"నేను విచారించను...విచారించినా, ఇప్పటిదాకా నా జీవితం వ్యర్థం చేసుకొన్నందుకే..."

"దాంపత్యం—అంతలోదేనా?"

"మనసూ మనసూ కలిసిన దాంపత్యాలు దాంపత్యాలు... పుస్తె కట్టినంతమాత్రాన కాదు. దేశాచారాలని మనం అనుస

రించాం...రెండు పశువులని ఒక బండికి కట్టినట్లు మనని కలి పారు...అంతే..."

"నీ-గుండెల కాఠిన్యం తల్చుకుంటే, ఆశ్చర్యం వేస్తూంది శశీ!"

"నిజం ఎప్పుడూ అలాగే ఉంటుంది..."

"వెళ్లు—దూరంగా పో..."

అరిచాడు సుందరం... శశి తొందరగా అవతలి గదిలోకి వెళ్ళిపోయింది, పొంగి పొరలివస్తూన్న కన్నీళ్ళని బలంగా అపు కుంటూ.

"లాభం లేదా డాక్టర్?"

"లేదమ్మా...చివరి గడియలు..."

పరుగున వెళ్ళి శశి సుందరం మంచం మీద పడ్డది-తాను నిర్ధారణ చేసుకొన్న నిర్లిప్తత ఆమెని ఆపలేకపోయింది; చివరి నిమిషాలలో తన మనస్సుని అమ్ముకోకూడదనే పట్టుదల ఆమెని ఆపలేకపోయింది.

సుందరం నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

ఆమె ఆవేదనతో అతనివైపు చూస్తున్నది; కళ్ళు లోతుకి పోయాయి-తలనిండా రక్తం...మృత్యుగహ్వరంలోకి అడుగు పెట్టడానికి సంసిద్ధుడుగాడున్న ఈ బాటసారి...తన-భర్త...

శశి ఇంక ఏడ్వకుండా ఉండలేకపోయింది—సుందరం నెమ్మదిగా సైగచేశాడు..."ఏడవకు"...అన్నాడు.

చివరి సారి అతని మాటలని వినడానికి ఆమె తనని తాను సంబాళించుకున్నది.

"క్షమించవూ శశీ?"

నీరసంగా అన్నాడతను...ఆమె చేతులని తన చేతులలోకి తీసుకుంటూ...ఈ మహా విశాల ప్రపంచంలో కొద్ది క్షణాల తరువాత తానెక్కడ ఉంటాడో!...ఈ అనంత కాల మానంలో మళ్ళీ తామిద్దరూ కలుస్తారో కలియరో!

దుఃఖభారంతో శశి మాటలాడలేక పోయింది...'కాదు... కా'దని తలమాత్రం ఊపింది...

"పోనీ..."

సుందరం నెమ్మదిగా అన్నాడు...నెమ్మదిగా తలక్రింద నించి ఒక పొట్లం తీశాడు...

"ఒక్క కోర్కె తీర్చు శశీ...కాదనకు"

పొట్లం నీరసంగా విప్పాడు—నెక్లస్...గదిలోని సగం కాంతిలో తళ తళ లాడుతూన్నది.

"కొంచెం వొంగు శశీ!"

దుఃఖం ఆమెలో వణకుతూ రెండు చేతులతోనూ కళ్ళు మూసుకుని అతనిమీదకి వొంగింది అతను నెక్లస్‌ని ఆమె మెడకి తగిలించాడు...ఆమె చేతులు తియ్యలేదు...ఏడుపుని ఆపుకుంటూ...

"ఒకసారి...ఒక్కసారి ఇటు చూడు శశీ..."

శశి నెమ్మదిగా కళ్ళని ఖాళీచేసుకున్నది...అతని ముఖంలో సంతృప్తి గోచరించింది...

"ఎంత-అందంగా ఉన్నావు!"

ఆమె చేతులని మృదువుగా సుందరం తన చేతులలోకి తీసుకున్నాడు...

ఆమె మాట్లాడలేదు...నిశ్చలంగా చూస్తూన్నది....

కొద్ది నిమిషాలలానే గడిచిపోయాయ్...నెమ్మదిగా.... నెమ్మది నెమ్మదిగా అతని చేతులు ఆమె చేతులలో బిగుసుకొన్నాయ్...అదేమీ శశికి తెలియడం లేదు...మెడలోని ఆభరణం...బిగువుగా ఉన్నది.